క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈవో

నగరి: మున్సిపల్ పరిధి బుగ్గ కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శ్రీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. బోధనా విధానాలను, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు సులభరీతిన బోధించడానికి వినూత్న పద్ధతులను అవలంబిస్తున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు.

మునీశ్వర ఆలయంలో కుంభాభిషేక పూజలు



కుంభాభిషేక పూజల్లో ఆలయ నిర్వాహకులు

నగరి: పట్టణ పరిధి కొంమిట్ట వేల్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మహామునేశ్వర ఆలయ కుంభాభిషేక వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గణపతి హోమం, నవగ్రహ హోమం, లక్ష్మీ హోమం పూర్ణాహుతి నిర్వహించారు. కుంభాలంకార కార్యక్రమం నిర్వహించారు. మొదటి కాలయాగ పూజలు, దీపారాధన చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పెన్షనర్లకు ప్రయోజనాలు అందించాలి

నగరి: పెన్షనర్లకు అందాల్సిన ప్రయోజనాలను ప్రభుత్వం సకాలంలో అందించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎ.జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక పెన్షనర్ల భవనంలో శుక్రవారం ఆయన పెన్షనర్లతో సమావేశమయ్యారు. దివంగత పింఛనుదారులతోపాటు ఇటీవల మృతి చెందిన రామోజీరావుకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందవలసిన ప్రయోజనాలను సకాలంలో అందించి పింఛనుదారులకు ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం, సభ్యులు జనార్దన్, రామచంద్రన్, మోహన్, పళని, సుమబాల, భానుమతి, తిలకం, వెంకట్రాజు, నాగార్జున, శివప్రసాద్, మునిరత్నం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గంజి, మజ్జిగ పంపిణీ



గంజి, మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

నగరి: వేసవి తీవ్రతను పురస్కరించుకొని స్థానిక ఓంశక్తి ఆలయం వద్ద ప్రారంభించిన గంజి, మజ్జిగ పంపిణీ 64వ రోజుకు చేరుకోవడాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పుష్పమాలలతో అలంకరించారు. భక్తులకు, పాదచారులకు ఆలయం వెలుపల గంజి, అంబలి, మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగుతోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. దాతలకు ఆలయం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తరా నక్షత్ర పూజలు



ఆలయ సహపంక్తి భోజనంలో భక్తులు

నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపం గల శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. భక్తులు ప్రేమలత, కృపానిధి, సత్య, రమేష్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, దుర్గా ప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 2.15 లక్షలు

కార్వేటినగరం: స్థానిక ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి హుండీ ఆదాయం 2,15,990 రూపాయలు వచ్చినట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో టీటీడీ సెక్యూరిటీ ఆధ్వర్యంలో పరకామణి నిర్వహించారు. ఆలయ అధికారి మాట్లాడుతూ, మే 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు 7వ తేదీ పుష్పయాగం రోజున ఎక్కువ మొత్తంలో కానుకలు సమర్పించారన్నారు.

వయ్యారి.. మహమ్మారి

- వయ్యారిభామ మొక్కతో అనేక నష్టాలు
- సామూహిక నిర్మూలనే మార్గం



వ్యవసాయ అధికారి హేమలత

కార్వేటినగరం: ప్రపంచంలో మొండిజాతికి చెందిన 10 రకాల కలుపు మొక్కలలో పార్థీనియం ఒకటి. అమెరికాకు చెందిన ఈ కలుపు మొక్క సుమారు 70 ఏళ్లక్రితం గోధుమ విత్తనాల దిగుమతితో మన దేశంలో ప్రవేశించింది. దీనిని ఇక్కడ వయ్యారిభామ, మాచర్ల కంప, ముక్కుపుడక అని పిలుస్తుంటారు. ఉత్తర భారతదేశంలో క్యారెట్‌గ్రాస్, కాంగ్రెస్ వీడ్ అని కూడా అంటారు. ఈ కలుపు మొక్క కారణంగా వ్యవసాయంలో 40 శాతం వరకు పంట నష్టం వాటిల్లుతోంది. చూడడానికి అందంగా కనిపించే ఈ మొక్కలను వదిలేస్తే ఎన్నో సమస్యలు తప్పవు.

ఆరువారాల్లోనే పూత

పార్థీనియం మొక్క సుమారు రెండు మీటర్ల ఎత్తు వరకు ఎదుగుతుంది. దీని ఆకులు చీలికలతో కూడి సన్నటి నూగులాంటి రోమాల మాదిరిగా పెరుగుతాయి. మొలకెత్తిన నాలుగు నుంచి ఆరు వారాల్లోనే పూత దశకు వస్తుంది. ఒక్కోమొక్క 10 వేల నుంచి 25 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. ఈ విత్తనాల పై భాగం జుత్తుక లిగి ఉండడంతో గాలి, నీరు, పశువులు, మనుషులు, వ్యవసాయ పనిముట్లు ద్వారా సులువుగా వ్యాపిస్తాయి. ఈ మొక్కలోని అన్ని భాగాల్లో(కాండం, ఆకులు, కొమ్మలపై నూగు పుప్పొడి) పార్థీనిష్ అనే విష పదార్థం ఉంటుంది. ఈ విషం వలన మానవాళికి పశువులకు వివిధ రకాల జబ్బులు వస్తాయి. ముఖ్యంగా పంట పొలాలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాలు, రహదారుల పక్కన, పార్కులు, రైల్వేలైన్ వెంబడి ఇవి విస్తారంగా వ్యాపిస్తాయి. చూడడానికి అందంగా ఉండడంతో వీటిని ఎవ్వరూ నాశనం చేయరు.

సమగ్ర నివారణ పద్ధతులు

పార్థీనియం మొక్కలను నిర్మూలించడానికి మండల వ్యవసాయాధికారి హేమలత పలు నివారణ చర్యలను సూచించారు. గ్రామాల్లో రైతులందరూ తమ పొలాల్లో సామూహికంగా చర్యలు చేపట్టాలి. పూత రాకముందే ఈ మొక్కలను వేర్లతో సహా పీకి తగలబెట్టాలి. ఆపై ఎక్కడైనా మొక్కలు మొలిస్తే వెంటనే వాటిని కూడా వేర్లతో సహా పెకలించాలి. ఈ విధంగా నాలుగైదు సంవత్సరాలు చేస్తేనే వీటిని పూర్తిగా నివారించవచ్చు.

- వేసవిలో పొలాలను లోతుగా దుక్కి చేయడంతో కలుపు విత్తనాలు కూడా లోతుకు పోయి మొలకెత్తవు. తద్వారా పార్థీనియం ఉత్పత్తి తగ్గుతుంది.
- నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాలలో బంతి పంట మార్పిడి సాగు ద్వారా కూడా కలుపును నివారించవచ్చు.
- జైకోగ్రాం, బైకొలరేటా అనే కీటకాలు ఈ మొక్కల ఆకుల కాండాన్ని తినడం ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పొలంలో ఈ మొక్కల తీవ్రతను అనుసరించి 500 నుంచి వెయ్యి వరకు పైన పేర్కొన్న కీటకాలను వదలడం ద్వారా వాటి సంతతి కూడా వృద్ధి చెందుతూ పెద్ద, చిన్న కీటకాలు ఈ మొక్కలను సమగ్రంగా ఆరగిస్తాయి.
- పైరు సాగు చేయని పొలాల్లో ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం(లీటరు నీటికి 150 లేదా 200 గ్రా) పూతకు రాకముందే కలుపు మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా కూడా వీటి ఉధృతిని తగ్గించవచ్చు.



చెరకు పంటలో ఏపుగా పెరిగిన వయ్యారిభామ(పార్థీనియం) మొక్కలు

అనేక అనర్థాలు

మన ప్రాంతంలో వయ్యారి భామగా పిలిచే ఈ పార్థీనియం మొక్కల పుప్పొడితో మనుషుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధులు (ఆస్తమా) చర్మ వ్యాధులు, విష జ్వరాలు వస్తాయి.

- పశువులకు కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, చర్మవ్యాధులు సోకుతాయి.
- పశువులు ఈ మొక్కలను ఆహారంగా తీసుకున్నప్పుడు చర్మ సంబంధమైన వ్యాధులు కలగడమే కాకుండా పాల ఉత్పత్తి తగ్గి బరువు కూడా కోల్పోతాయి.
- పార్థీనియం మొక్కలు ఒక రకమైన రసాయనాన్ని వేర్ల ద్వారా స్రవించి ఇతర మొక్కలను మొలకెత్తకుండా నిరోధిస్తాయి. ఇవి ఉన్న చోట వేరొక మొక్కలు బతకవు
- పచ్చిక మైదానాలలో గడ్డి రాకుండా, ఎదగకుండా చేస్తాయి. ఈ కారణంగా పశుగ్రాసం కొరతకు కారణమవుతాయి.

సబ్సిడీతో జనుము విత్తనాల పంపిణీ

గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీతో జనుము విత్తనాలు పంపిణీ చేయనున్నారని మండల వ్యవసాయ అధికారి వందన తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఒక కిలో జనుము విత్తనాలు 88 రూపాయలు కాగా ప్రభుత్వం ద్వారా 50 శాతం సబ్సిడీతో రూ.44కే ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద తీసుకోవచ్చని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కార్వేటినగరం: సీజనల్‌వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హేమశ్రీ అన్నారు. ఆర్కేవీబీ పేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే ప్రమాదకరమైన వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచిచారు. దోమకాటు వల్ల వ్యాప్తి చెందే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి రోగాలు చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ గౌరీ, వైద్య సిబ్బంది అంబరీష్‌రాజు, జీవిత, మునీశ్వరి, ఆశవర్కర్లు లత, అనురాధ పాల్గొన్నారు.

‘హంస’ నూతన యూనిట్ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా కమిటీ

నగరి: ఏపీ హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) నగరి తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సర్వసభ్య సమావేశం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షులుగా విజయపురం పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ పి.మునిశేఖర్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా పచ్చికాపల్లం పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ పుష్పవాణి, నగరి ఏరియా ఆస్పత్రి స్టాఫ్ నర్స్ పుష్పలత, సీనియర్ అసిస్టెంట్ స్వప్నమాధురి, బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీ మహిళా కార్యకర్త కళ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులు, తాలుకా కార్యదర్శులుగా నింద్ర పీహెచ్‌సీకి చెందిన శ్రీదేవి, శ్రీనివాస నాయక్, ట్రెజరర్‌గా కార్వేటినగరం పీహెచ్‌సీకి చెందిన సుధాకర్, ప్రచార కార్యదర్శిగా విజయపురం పీహెచ్‌సీకి చెందిన సుధాకర్, మహిళా కార్యదర్శిగా నగరి ఏరియా ఆస్పత్రికి చెందిన నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీకి చెందిన నంబి మధు, జాయింట్ సెక్రటరీలుగా అమరావతి, ఇదయతుల్లా, పి.శాంతి, పి.సుమతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎ.ప్రత్యూష, కె.శివప్రసాద్, జి.రామ్మోహన్, కె.ప్రభావతి ఎన్నికయ్యారు.

ఏపీ హంస జిల్లా అధ్యక్షులు రాజా మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్యాన్ని కాపాడుతూ, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న వైద్యారోగ్య శాఖా ఉద్యోగుల పక్షాన గత దశాబ్ద కాలంగా అలుపెరుగని సేవలు చేస్తున్న ఏకైక సంఘం హంస మాత్రమే అన్నారు. ఇది ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏకైక వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సంఘమన్నారు. సంఘావిష్కరణ నుంచి తోడుగా నిలుస్తున్న వైద్యారోగ్య ఉద్యోగులు, డిమాండ్ల సాధనలో నిర్విరామంగా సేవలందించగలిగిన వారికి మాత్రమే కార్యవర్గంలో అవకాశం కల్పించినట్లు వివరించారు. ఉద్యోగులకు అసోసియేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎన్నికలను సజావుగా నడిపి విజయవంతం చేసిన ఎన్నిక అధికారులు ఇమ్రాన్, ముఖేష్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టాటాబాయ్, శ్రీకాళహస్తి తాలుకా కార్యదర్శి గౌరి, కార్యనిర్వాహక కార్యదర్శి గిరిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఆకుల సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన ఆకుల సుబ్రమణ్యం 19వ వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, సీడీ కండ్రిగ పంచాయతీ సర్పంచ్ ఆకుల మంగమ్మ, ఆకుల గోపి రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. సుమారు 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పంచాయతీ అభివృద్ధికి కృషి చేసిన ఆకుల సుబ్రమణ్యం జ్ఞాపకార్థం ఏటా వృద్ధులకు అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతిరెడ్డి, వెంకటేశులు, మునిమండడి, మురళి, రాజారాం మండడి పాల్గొన్నారు.

ఘనంగా రక్తదాతల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి

కార్వేటినగరం: రక్తదాతలుగా మారి.. ప్రపంచాన్ని ఆరోగ్యవంతమైన ప్రదేశంగా మార్చడానికి సహాయపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విజయులురెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో రక్తదాతల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ప్రతి యువత రక్తదాతలుగా సహాయపడాలని పిలుపునిచ్చారు. సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ, శస్త్ర చికిత్సలు, ప్రసవం, క్యాన్సర్ చికిత్స, ప్రమాద బాధితులకు అత్యవసర ఆపరేషన్లు..ఇత్యాది వాటికి రక్తదానం ఎంతో కీలమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ, స్నేహితులను, కుటుంబ సభ్యులను సాధారణ రక్తదాతలుగా ప్రోత్సాహించాలని కోరారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ భాగ్యలక్ష్మి, ఆర్థోపెడిషియన్ డాక్టర్ లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్ అంబరిషీరాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న రాస్ అధికారి రవి


పుత్తూరు: చేతి వృత్తుల్లో శిక్షణతోపాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రాస్ అధికారి రవి సూచించారు. స్థానిక రాష్ట్రీయ సేవా సమితి (రాస్) కార్యాలయంలో శుక్రవారం ఆర్యా వర్క్ శిక్షణా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో 84 రోజుల పాటు ఆర్యా వర్క్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ రంగాల్లో శిక్షణ పొందుతున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహంతో పాటు రుణాలను అందిస్తోందని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆర్యావర్క్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 20 మంది మహిళలకు సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు.

24న వైద్య శిబిరం

టాటా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాస్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పీఆర్‌ఓ హేమంత్ తెలిపారు. శిబిరంలో కాన్సర్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించి 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాస్ జేఎస్ఎస్ అధికారి హరి, ప్రకాష్, జయంతి పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు పుట్ట పూజ





గెరిగతో పుట్టకు పూజ చేయడానికి పసుపు నీటి బిందెలు తీసుకొస్తున్న భక్తులు, అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని మణిపురంలో రేణుకా ఎల్లమ్మకు కొలువు మహోత్సవంలో భాగంగా శుక్రవారం భక్తిప్రపత్తులతో పుట్ట పూజ చేశారు. ఉదయం అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి పంచామృతం, చందనంతో అభిషేకించారు. మధ్యాహ్నం గ్రామ మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. సాయంత్రం పూలతో గెరిగ తయారు చేసి పంబ వాయిద్యాలు వాయిస్తూ, కొమ్ముబూరలు ఊదుతూ, అమ్మవారికి సమీపంలో ఉన్న పుట్ట వద్దకు వెళ్లారు. పసుపు, కుంకుమ, వివిధ పుష్పాలతో అలంకరించి, మహిళలు టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించి పుట్ట పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. సమర్పించారు. అమ్మవారిని వేదపండితులు అందంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నూతన ప్రభుత్వం రాష్ట్రంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆశిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి తెలిపారు. చిత్తూరులో శుక్రవారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతన పెంపు హామీని అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. బిల్డింగ్ కార్మికులకు బోర్డు ద్వారా మరింత సంక్షేమం అందించాలన్నారు. హమాలీ, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును అమలు చేయాలని చెప్పారు. ఉద్యోగ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు జిల్లా కార్మికులు ఐక్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సంసిద్ధత కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా నాయకులు రమాదేవి, విజయ్ కుమార్, అంగన్‌వాడీ నాయకులు ప్రభావతి, అరుణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుగుణ, జయశంకర్, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, సివిల్ స్లపయ్స్ నాయకులు కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు సునీల్‌కుమార్‌నాయక్

బంగారుపాళెం: క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు కేన్సర్ స్క్రీనింగ్‌పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేన్సర్ వ్యాధి ఎలా వస్తుంది. ఏవిధంగా గుర్తించాలనే విషయంపై శిక్షణపై డాక్టర్లు శిరీష, స్వాతి శిక్షణ ఇచ్చారు. గర్భసంచి ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ కేన్సర్‌ల గురించి వివరించారు. కేన్సర్‌ను ముందుగా గుర్తించి సకాలంలో వైద్యం అందించడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు సునీల్‌కుమార్‌నాయక్ సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు.

నగరంలో పారిశుద్ధ్యం అధ్వానం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వెనుక వైపు గల వీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వీరభద్రకాలనీ అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఎటువైపు చూసినా చెత్తచెదారం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. ఈ ప్రాంతంలో కాలువలు లేకపోవడంతో నివాసాల్లోని మురుగునీరు ఓ చోట చేరి చిన్న బావిగా మారింది. పొరబాటున అందులో పిల్లలు పడితే ప్రాణాలకే ప్రమాదం. కాలనీ ప్రవేశం నుంచి చివరి వరకు రోడ్డుకు ఇరువైపులా ఎటు చూసినా పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు చీకటి వేళ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మురుగునీరు నిల్వ చేరడంతో అందులో పురుగులు చేరి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. వర్షం పడితే వచ్చే దుర్వాసన వల ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే కష్టంగా మారింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వీరభద్రకాలనీ రోడ్డుపైన చెత్తకుప్ప



ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలు



మురుగునీటితో ఏర్పడిన చిన్న కుంట